## కంటి పరీక్షలు
# ముమ్మరం

- రంగారెడ్డిజిల్లాలో 7,753 మందికి కంటి పరీక్షలు
- 373 మందికి కంటి అద్దాలు పంపిణీ
- 395 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాల కోసం ఆర్డర్


షాబాద్ మండలం కుమ్మరిగూడలో..

షాబాద్, జూన్ 19 : గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. కంటి వెలుగు శిబిరాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. జిల్లాలో 80 బృందాల ద్వారా వైద్యసిబ్బంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమున్నవారికి కంటి అద్దాలతోపాటు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 7,753 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 373 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 395 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాల కోసం ఆర్డర్ చేశారు.

## విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి
### వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్, జూన్ 19 : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ విద్యా దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం విద్యా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ పాఠశాలలను మామిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించుకోవాలన్నారు. ఉదయం 7:30 నుంచి 8:45 వరకు విద్యార్థులు ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ఉదయం 9:30 గంటలకు అన్ని పాఠశాలల్లో పతాకావిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లు, విద్యార్థులను సన్మానించాలన్నారు. ఈ నెల 21న బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ పంచాయతీల వరకు ఆలయాలు, మసీదులు, చర్చిలు ఇతర ప్రార్థనా మందిరాలను అందంగా అలంకరించాలన్నారు. ప్రత్యేక భక్తి, హరికథలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులతో పాటు నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా.. వ్యక్తి మృతి
### కందనెల్లి శివారులో ఘటన


కుంటలో పడ్డ ఆటో

పెద్దేముల్, జూన్ 19 : ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధి కందనెల్లితండా గ్రామ శివారులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధి గాజీపూర్ గ్రామానికి చెందిన బుడ్డ లక్ష్మి కుమారుడు శ్రీనివాస్(36) ఆటో నడుపుకొంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 18న ఉదయం ఆటో తీసుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో కందనెల్లి శివారులోని అంతిరెడ్డి కుంటలో ఆటోతో సహా నీటిలో పడిపోయి ఉన్నాడని గాజీపూర్ గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. 18న రాత్రి సమయంలో అంతిరెడ్డికుంట కట్టపై ఆటో అదుపుతప్పి కుంటలోని నీటిలో ఆటోతో సహా పడగా.. ఆటో శ్రీనివాస్‌పై పడి నీటిలో ఊపిరి ఆడక చనిపోయినట్లు నిర్ధారించారు. శ్రీనివాస్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు.

## కనిపించకుండా పోయిన వ్యక్తి శవంగా..

కొడంగల్, జూన్ 19 : వారం రోజుల క్రితం ఇంటి నుంచి కనిపించకుండా పోయిన వ్యక్తి శవంగా కనిపించిన సంఘటన మండలంలోని చిట్లపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ రవిగౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని చిట్లపల్లి గ్రామానికి చెందిన సురేశ్(55) వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. వ్యక్తి ఆచూకీ గురించి కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని వాగు ప్రదేశంలో శవంగా పడి ఉండటాన్ని గ్రామస్తులు గుర్తించి సమాచారం అందించినట్లు తెలిపారు. ఆ గ్రామ వీఆర్ఏ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. మద్యానికి బానిసై ఆరోగ్యం క్షీణించి చనిపోయినట్లుగా గ్రామస్తులు తెలిపారని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

## కాళీమాత ఆలయంలో చోరీ


శంకర్‌పల్లి, జూన్ 19 : కాళీమాత ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ ప్రసన్న కుమార్ కథనం ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో గల కాళీమాత ఆలయంలో సోమవారం ఉదయం పూజారి రాంచంద్రయ్య గుడి తలుపులు తెరిచి చూడగా హుండీ పగులగొట్టి 30 వేల నగదును దొంగలు ఎత్తుకువెళ్లారన్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కుమ్మర సంఘం కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 19 : ఇబ్రహీంపట్నం మండలం కుమ్మర సంఘం నూతన కమిటీని సోమవారం సంఘం నియోజవకర్గ అధ్యక్షుడు కాసుల పాండు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు ఆడాల గణేశ్ మాట్లాడారు. కుమ్మరుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బత్తుల జంగయ్య, ఉపాధ్యక్షులుగా కొయ్యడ బలరాం, దోర్నాల యాదగిరి, గౌరవాధ్యక్షుడిగా దోర్నాల శంకర్, కార్యదర్శిగా బస్వాపురం శివ, సహాయ కార్యదర్శిగా శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా అంజయ్య తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం యువజన విభాగం కమిటీని ప్రకటించారు. సంఘం యువజన విభాగం మండల అధ్యక్షుడిగా దోర్నాల రాము, ప్రధాన కార్యదర్శిగా టేకుమల్ల సాయికుమార్‌ను ఎన్నుకున్నారు.





### చెప్పుకోండి



1. వృద్ధాప్యాన్ని అధ్యయనం చేసే శాస్త్రం పేరు ఏమిటి?
2. 'చీమలు' ఎవరి రచన?
3. టైఫాయిడ్ మానవ శరీరంలో ఏ భాగానికి వస్తుంది?

### జతచేయండి

కింది బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి.





## మొసలి ఆపద

**ఒక** మడుగులో కొన్ని చేపలు, కప్పలతోపాటు ఒక మొసలి ఉండేది. అది చాలా మంచిది. ఆ మడుగులో ఎన్ని జంతువులు నీళ్లు తాగడానికి వచ్చినా.. ఆ మొసలి ఏమీ అనేది కాదు. ఇతరులు ఇచ్చిన ఆహారంతో, అప్పుడప్పుడూ పండ్లతో కడుపు నింపుకొనేది తప్ప.. జంతు హింస చేసేది కాదు. ఒకసారి ఆ మొసలి బిడ్డ ఒడ్డుపైకి వెళ్లింది. అప్పుడే అనుకోకుండా దానిని ఒక చిరుతపులి చూసి పట్టుకున్నది. అప్పుడు ఆ చిన్న మొసలి.. ''అమ్మా! అమ్మా'' అని బిగ్గరగా అరిచింది. బిడ్డ అరుపులు విన్న మొసలి.. ''అయ్యో! నా బిడ్డకు ఆపద వచ్చింది. నేను ఇంతవరకూ ఎవరికీ హాని చేయలేదు. నాకెందుకు ఈ విపత్తు? నా బిడ్డను చిరుతపులి బారినుంచి ఎలా కాపాడుకునేది?'' అంటూ బాధపడ సాగింది. ఇంతలోనే చిరుతపులి దగ్గరికి దాని బిడ్డ వచ్చింది. ''అమ్మా! అమ్మా! నాకు ఈ రోజు జింక మాంసం కావాలి. ఈ మొసలి మాంసం అక్కర్లేదు. నువ్వు వెంటనే నాకు జింకపిల్ల మాంసం తెచ్చిపెట్టు'' అని అడిగింది. అప్పుడు చిరుతపులి ''అయ్యో బిడ్డా! ఈ అడవిలో వేటగాళ్లు జింకలన్నిటినీ వేటాడి.. ఒక్క జింక కూడా కనిపించకుండా చేశారు. అందుకే ఈ మొసలిని మనకు ఆహారంగా పట్టుకున్నాను. ఇది కూడా నేలపైన ఉండటం వల్ల నాకు దొరికింది. ఇదే నీటిలో ఉండి ఉంటే దీనికే నేను భయపడాల్సి వచ్చేది'' అన్నది. అప్పుడు బుల్లి చిరుత.. ''అమ్మా! నాకు అదంతా అనవసరం. ఇప్పుడు నాకు జింక మాంసం తెచ్చిపెట్టు. నేను ఇక్కడికి వచ్చేటప్పుడు అక్కడ ఒక జింక గెంతుతూ కనిపించింది'' అన్నది. అది విన్న చిరుతపులి మొసలి పిల్లను వదిలిపెట్టి.. జింక వేట కోసం తన బిడ్డ చూపిన వైపు వెళ్లింది. వెంటనే మొసలి పిల్ల 'బతుకు జీవుడా!' అంటూ తిరిగి నీటిలోకి దూకి.. తల్లి దగ్గరికి చేరుకుంది. అప్పుడు, ఆ మొసలి ఎంతో సంతోషించి.. 'నా మంచితనమే బుల్లి చిరుత రూపంలో వచ్చి నా బిడ్డను కాపాడింది. లేకుంటే ఆ సమయంలో చిరుతపులి బిడ్డ రావడం ఏమిటి? జింక మాంసం అడగడం ఏమిటి? దాని మాట విని చిరుతపులి నా బిడ్డను వదిలిపెట్టడం ఏమిటి? ఇదంతా నా మంచితనం వల్లనే జరిగింది' అనుకున్నది. 'ఇకముందు కూడా నేను మంచి పనులే చేస్తాను. అందువల్ల తాత్కాలికంగా కష్టాలు వచ్చినా.. చివరికి మంచే జరుగుతుంది' అనుకొని.. తన బిడ్డతోపాటు నీటి లోపలికి వెళ్లిపోయింది.


కథ

• సంగనభట్ల చిన్న రామకిష్టయ్య





### పెద్దల మాట



చిన్న పనులను నిర్లక్ష్యంగా చేసేవారు.. జీవితంలో పెద్ద విజయాలను సాధించలేరు.

• ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

### టంగ్ ట్విస్టర్స్

To begin to toboggan first buy a toboggan, but don't buy too big a toboggan. Too big a toboggan is too big a toboggan to buy to begin to toboggan.

**కింద** ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

daughter

Ex : rat



### ఇంగ్లిష్ క్విజ్

What has a face and two hands but no arms or legs?


జవాబులు

చెప్పుకోండి : 1. జిరంటాలజీ, 2. బోయ జంగయ్య, 3. చిన్నపేగు
పూరించండి : dog, egg
ఇంగ్లిష్ క్విజ్ : A clock

### పిటర్ ప్యాండ్స్

మహాదేవోజు సుస్మిత
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.





### పూరించండి

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.




పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com